'పేదల జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం'

రాజేంద్రనగర్: నిరుపేదల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆటలాడుతుందని రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ అర్చనాజయప్రకాశ్ ఆరోపించారు. ఆదివారం ఉదయం శివరాంపల్లిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ.. మాజీమంత్రి హరీష్‌రావు సబితా ఇంద్రారెడ్డితో కలిసి బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కలిసి ఆదివారం ఉదయం హైదర్షాకోట్ ప్రాంతంలోని సాయిరాంనగర్ కాలనీ ఇతర ప్రాంతాల్లో పర్యటించారు. నిరుపేదలైన పలువురు ఈ ప్రాంతంలో పైసా పైసా కూడపెట్టుకుని ఇళ్లను నిర్మించుకున్నారని తెలిపారు. మూసీ రివర్ బెడ్ అంటూ.. వీరి నిర్మాణాలను ప్రభుత్వం కూల్చేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. కొందరు సైన్యంలో పనిచేసి రిటైర్‌మెంట్ అనంతరం వచ్చిన డబ్బుతో ఇళ్లు కట్టుకుని ఉన్నారన్నారు. దేశం కోసం పోరాడిన వారు నేడు తమ ఇంటి కోసం పోరాడాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల ఉసురు తీస్తుందని ఆరోపించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..



సమావేశంలో పాల్గొన్న కార్యవర్గ సభ్యులు

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, వీధి దీపాలు, పార్కుల అభివృద్ధి తదితర సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పరిష్కారానికి ప్రతి కాలనీలో కలసికట్టుగా కృషి చేద్దామని మణికొండ మున్సిపాలిటీ ఆల్ కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ అవినాష్ అన్నారు. ఆదివారం హుడా కాలనీ కమ్యూనిటీహాల్‌లో కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇటీవల కార్యవర్గ సమావేశంలో అధ్యక్షుడిగా అవినాష్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో కాలనీల వారిగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వచ్చే ఏడాది లోగా మార్చిలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి బాబురావు, ఉపాధ్యక్షులు, పలు కాలనీ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

రెడీమిక్స్ ప్లాంట్‌ను తొలగించండి !

మణికొండ: నివాసాల ఆవరణలో రెడీమిక్స్ ప్లాంట్‌ను కొనసాగించి ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని మైహోం అవతార్, హాల్ మార్క్ విసినియా రెసిడెన్స్ పక్కనే రెడీమిక్స్‌ను నిర్వహిస్తూ.. రాత్రి, పగలు తేడా లేకుండా పెద్ద శబ్దాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. దీనిపై నివాసితులు పెద్దఎత్తున సంతకాలతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండేళ్ల క్రితం కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ అధికారులు వాటికి అనుమతులు లేవనే కారణంతో సీజ్ చేశారన్నారు. అయినా కొందరు అవినీతి అధికారుల మద్దతుతో తిరిగి వాటిని కొనసాగిస్తూ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారన్నారు. వాటిని వెంటనే మూసేయకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయటంతో పాటు నిర్మాణ సంస్థ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

మహ్మద్ సల్మాన్ అహ్మద్‌కు డాక్టరేట్



సినీనటి శిల్పాశెట్టి చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న దృశ్యం

శంషాబాద్: శంషాబాద్ మండలం హమీదుల్లానగర్ గ్రామానికి చెందిన మహ్మద్ సల్మాన్ అహ్మద్ డాక్టరేట్ అందుకున్నారు. ఐక్యరాజ్య సమితి, జాతీయ మానవహక్కుల సంఘం నిర్వహించిన సెమినార్‌లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, లీగల్ స్టడీస్ విభాగంలో ఆయనకు డాక్టరేట్‌ను ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సినీనటి శిల్పాశెట్టి చేతుల మీదుగా అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. విశిష్ట సంస్థల చేత అందిన గుర్తింపుతో మానవ హక్కుల పరిరక్షణ కోసం మరింత కృషి చేస్తానన్నారు.

రోడ్లకు ప్యాచ్‌వర్క్స్ చేపట్టండి

రాజేంద్రనగర్: గగన్‌పహాడ్ ప్రాంతంలోని కాలనీలు, బస్తీలు పూర్తిగా గుంతలమయంగా మారాయని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేవైఎం అధ్యక్షులు వినయ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం ఉదయం ఆయన బస్తీలు, కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో వివిధ అభివృద్ధి పనుల అనంతరం ప్యాచ్‌వర్క్స్ నిర్వహించకుండా వదిలేశారన్నారు. దీని కారణంగా రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందన్నారు. గతంలో కురిసిన వర్షాలకు మరింతగా దెబ్బతిందన్నారు. దీంతో బస్తీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి ప్యాచ్‌వర్క్స్‌ను వెంటనే నిర్వహించాలని కోరారు.



గుంతలమయంగా మారిన రోడ్లు ఇలా..

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రాజేంద్రనగర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. కర్మన్‌ఘాట్ ప్రాంతానికి చెందిన మధుసూదన్ (57) ఆదివారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై రాజేంద్రనగర్ నుంచి హిమాయత్‌సాగర్ వైపు వెళుతున్నాడు. ఈ క్రమంలో హనుమాన్‌నగర్ వద్దకు రాగానే హిమాయత్‌సాగర్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎగిరి కిందపడిన అతడికి తీవ్ర గాయాలయ్యాయి. ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ గుర్తును బుల్డోజర్‌గా మార్చుకోండి

- ఇచ్చిన హామీలకు డబ్బులు లేవంటూ మూసీ సుందరీకరణకు ఎలా వస్తాయి?
- పేదవాళ్ల రక్తం తోడి సుందరీకరణ చేస్తారా..?
- మాజీ మంత్రి హరీష్‌రావు



బాధితులతో మాట్లాడుతున్న హరీష్‌రావు

లంగర్‌హౌస్: కాంగ్రెస్ పార్టీ చెయ్యి గుర్తు తొలగించి బుల్డోజర్ గుర్తు పెట్టుకోవాలని ప్రపంచ బ్యాంకులో తమ ఇళ్లు, స్థలాలను గిరివి పెట్టడానికి మీ అయ్యా జాగీర్లు కావని మాజీ మంత్రి హరీష్‌రావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ పరీవాహక నివాసితులను పరామర్శించేందుక ఆదివారం ఆయన లంగర్‌హౌస్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ..పేదల రక్తంతోడి మూసీ సుందరీకరణ చేస్తామంటే సహించేది లేదన్నారు. ఇళ్లు కట్టడానికి పేదలు జీవిత కాలం సరిపోదని, అలాంటిది వారి ఇళ్లను ప్రపంచ బ్యాంకులో తాకట్టు పెట్టి వారి ప్రాణాలు తీస్తామంటే తిరగబడతామన్నారు. ప్రజలెవ్వరూ భయపడవద్దని అందరికి కేసీఆర్ తోడుగా ఉన్నారని మీ అందరిలో భరోసా నింపడానికే తమను పంపారన్నారు. ఇళ్ల జోలి వస్తే ముందు తమ ప్రాణాలు అడ్డుపెడతామన్నారు. రాహుల్ గాంధీ వివిధ రాష్ట్రాల్లో పర్యటిస్తూ యోగి ఆదిత్యనాథ్‌పై బుల్డోజర్ రాజ్యం చెల్లదంటున్నారు, కానీ ఇక్కడ తెలంగాణలో బుల్డోజర్ రాజ్యం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో ప్రజలు ఎప్పుడు రోడ్డునపడలేదని, ఆయన హయాంలో అభివృద్ధికి నిర్మాణాలు చేసి, పేదల సంక్షేమానికి కృషి చేశారని ఇలా పేదలకు ఎప్పుడు ఇబ్బంది పెట్టలేదన్నారు.

సంక్షేమానికి మాత్రం డబ్బులు లేవా..?

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు, ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఇస్తామన్నారు. హామీలు నెరవేర్చలేరు, ప్రభుత్వ ఆస్పత్రులలో మందులు సరఫరాకు డబ్బులు లేవు అంటున్నారు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో భోజనాల డబ్బులు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం వద్ద ఖజానా లేదంటూ మూసీ కోసం లక్ష యాభై వేల కోట్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. 2013లో ప్రభుత్వ, ఎఫ్‌టీఎల్ ఏ రకమైన భూమి అయినా పేదల నుంచి ప్రభుత్వం తీసుకోవాలంటే కాంగ్రెస్ తీసుకు వచ్చిన చట్టాన్ని గుర్తు చేశారు. ఇంటి విలువకు మూడు రేట్లు అదనంగా డబ్బు, ఇంట్లో ప్రతి ఒక్కొక్కరికి రూ.5 లక్షలు అన్ని వసతులతో ఉన్న డబుల్ బెడ్ రూంలను ఇవ్వాలని కాంగ్రెస్ తీసుకువచ్చిన చట్టాన్ని మర్చిపోయారా అన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మహమూద్ అలీ, సబిత ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, కార్తీక్ రెడ్డి, స్థానిక నాయకులు అమర్‌సింగ్, ఉదయ్‌కుమార్ ఉన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



గండిపేట్‌లో రన్‌ను ప్రారంభించిన అతిథులు

స్వచ్ఛత హీ సేవ 5 కే రన్



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న కమిషనర్, చైర్‌పర్సన్‌లు

మణికొండ: మన పరిసరాల పరిశుభ్రతతో పాటు శారీరక శ్రమ, వ్యాయామంతోనే మనం సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తామని వాటికి ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని గండిపేటలో స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా 5కే రన్‌ను మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. జెండా ఊపి రన్‌ను ప్రారంభించిన వారు మాట్లాడుతూ.. ఇలాంటి సామాజిక కార్యక్రమాలతో ప్రజల్లో మంచి అవగాహన కలుగుతుందన్నారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా 10 రోజులుగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అన్ని వార్డులను పరిశుభ్రంగా మార్చామన్నారు. ప్రజలు సైతం తమ వంతు సహకారం అందించి మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. సినీనటులు గిరిధర్, ప్రభాకర్, చంద్రహాస్, కౌన్సిలర్లు అమరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రావు, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ రమేష్, డీఈ నరసింహారాజు, మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్, నాయకులు, స్థానిక నివాసితులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు.

నేడు మాజీ మంత్రి కేటీఆర్ పర్యటన

రాజేంద్రనగర్: మూసీ రివర్ బెడ్ బాధితులను కలిసేందుకు సోమవారం మాజీమంత్రి కేటీఆర్ రాజేంద్రనగర్‌కు రానున్నారు. సాయంత్రం 5 గంటలకు హైదర్‌గూడ నందనవనం అనంతరం అత్తాపూర్ మూసీ పరివాహక ప్రాంతంలోని ప్రజలను కలవనున్నారు. కేటీఆర్‌తో బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు,మాజీమంత్రులు, నాయకులు రానున్నారు. **అత్తాపూర్:** మూసీ పరివాహక నిర్వాసితులను పరామర్శించడానికి కేటీఆర్ సోమవారం అత్తాపూర్‌లోని లక్ష్మీనగర్ కాలనీ, చందనవనం అపార్ట్‌మెంట్‌తో పాటు స్థానిక ప్రాంతాల్లో పర్యటించనున్నారు. కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ నేత పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు బీఆర్ఎస్ నేతలు కొలన్ సుభాషన్‌రెడ్డి, బీఆర్ఎస్వీ నేతలు అప్పారెడ్డి ముఖేష్‌లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిర్వాసితులు, బాధితులు సకాలంలో హాజరుకావాలని సూచించారు.

గుండె ఆరోగ్యంపై అవగాహన ఉండాలి



వాకథాన్‌లో ప్రసంగిస్తున్న వైద్యులు

లంగర్‌హౌస్: గుండె ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని రెనోవా ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నగేష్, డాక్టర్ శివకుమార్, డాక్టర్ షోయబ్ అన్నారు. రెనోవా గ్రూప్ ఆఫ్ ఆస్పత్రుల ఆధ్వర్యంలో లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ నుంచి ఆదివారం 3కే వాకథాన్ నిర్వహించారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన ఈ వాకథన్‌లో భారతీయ యోగా సంస్థాన్, తపోవనం కమిటీ సభ్యులతో పాటు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైద్యులు మాట్లాడుతూ.. గుండె జబ్బులు రాకుండా ఆహార నియమాలు పాటిస్తూ, రోజు వ్యాయామం చేయాలన్నారు. ప్రముఖ సంఘసేవకులు రాజు వస్తాద్, రెనోవ ముఖ్య వ్యాపార అభివృద్ధి అధికారి జహీర్, మేనేజర్ మోసిన్ బృందం పాల్గొన్నారు.

గోల్కొండ ఎల్లమ్మకు సేవ చేయడం అదృష్టం



గోల్కొండ: గోల్కొండ ఎల్లమ్మకు సేవ చేయడం తన అదృష్టమని జగదాంబిక మహకాళి ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ.శ్రీనివాసరాజు అన్నారు. కార్యనిర్వహణ అధికారిగా నేడు పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా ఆయనను అమ్మవారి వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు సాయిబాబాచారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.శ్రీకాంత్‌చారి, మహంకాళి ఆలయ పూజారి బి.సురేష్‌చారి, నాగన్న, సర్వేష్ తదితరులున్నారు.

ముగిసిన ఫుట్‌బాల్ టోర్నీ

గోల్కొండ: 68వ హైదరాబాద్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. రిసాలబజార్‌లోని ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో జరిగిన ఫైనల్‌లో ఎన్‌బీటీనగర్‌కు చెందిన గవర్నమెంట్ హైస్కూల్ 1-0 తేడాతో హెచ్‌పీఎస్ రామాంతపూర్ టీమ్‌ను ఓడించింది. ఈ పోటీలకు గోల్కొండ ఒవైసీ ప్లేగ్రౌండ్ వేదిక కావడం స్థానిక ఫుట్‌బాల్ క్రీడాకారులకు ఎంతో మేలు చేకూరుతుందని పోటీల నిర్వాహకులు, ఫుట్‌బాల్ కోచ్ సఫ్దర్‌పాషా అన్నారు. మూడు రోజుల పాటు జరిగిన ఈ టోర్నమెంట్‌లో నగరంలోని పాఠశాలల ఫుట్‌బాల్ టీమ్‌లు పాల్గొన్నాయని ఆయన అన్నారు. భారతీయ విద్యాభవన్ టీమ్ మూడవ స్థానంలో నిలిచిందని, నాల్గొవ స్థానంలో కుల్సుంపురా ప్రభుత్వ ఉన్నత పాఠశాల టీమ్ నిలిచిందని ఆయన తెలిపారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి బాలరాజు పర్యవేక్షణలో ఈ పోటీలు జరిగాయని ఆయన తెలిపారు.



అనాథ యువతికి సరికొత్త జీవితం

వివాహం చేసేందుకు నిర్వాహకుల ఏర్పాట్లు

రాజేంద్రనగర్: సెంట్ ఆల్ఫోన్సా కరుణాలయంలో అనాథ యువతికి వివాహం చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సెంట్ ఆల్ఫోన్సా కరుణాలయం ఫాదర్ థామస్ ఆదివారం ప్రకటించారు. 2002 సంవత్సరంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సమర్పిత తాను ఏడాది వయస్సు ఉన్న క్రిస్టినాతో కలిసి స్టేషన్ ఫ్లాట్‌ఫారంపై ఉండటంతో రైల్వే పోలీసులు వివరాలను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో బుద్వేల్‌లోని సెంట్ అల్ఫోన్సా కరుణాలయానికి తరలించగా.. అప్పటి నుంచి ఇక్కడే ఉంటున్నారు. క్రిస్టినా స్థానిక పాఠశాలతో పాటు శామీర్‌పేట్ అనంతరం ఇంటర్మీడియట్‌ను కేరళలో చదివించారు. ప్రస్తుతం అక్టోబర్ 2న వివాహం చేసేందుకు ఫాదర్ థామస్ కుటుంబాలతో మాట్లాడి కరుణాలయంలో వివాహానికి ఏర్పాట్లు చేశారు. శామీర్‌పేట్‌కు చెందిన బొమ్మ వికాస్‌తో వివాహం జరిపించనున్నారు.

పీసీసీ అధ్యక్షుడికి నివేదిక అందజేత



మహేష్‌కుమార్‌గౌడ్‌కు నివేదికను ఇస్తున్న కమిటీ సభ్యులు

శంషాబాద్: ఇటీవల సిద్దిపేట జిల్లా ములుగురు దాసర్లపల్లిలో దళితులు ఏర్పాటు చేసుకున్న వినాయక ఉత్సవాల్లో జరిగిన ఘటనపై పీసీసీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సభ్యులు ఆదివారం పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు నివేదికను అందజేశారు. కమిటీ సభ్యులు పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్, అచ్యుత రమేష్‌బాబు, డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఈ ఘటన అనంతరం గ్రామంలో సందర్శించి వివరాలు సేకరించి నివేదికను తయారు చేశారు.

నిరుపేదలను దాతలు ఆదుకోవాలి

రాజేంద్రనగర్: నిరుపేదలను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని శ్రీ శ్రీనివాస సేవా సమితి చైర్మన్ పెండ్యాల సాయిమల్లిక్ సూచించారు. ఆదివారం కిస్మత్‌పూర్‌లోని ఓ అనాథాశ్రమంలో నిరుపేద పిల్లలకు ఆయన ఆహర పదార్థాలను అందజేశారు. ప్రతి ఒక్కరూ తరుచూ అనాథాశ్రమాలను సందర్శించాలని సూచించారు.

సౌత్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

రాజేంద్రనగర్: సీబీఎస్ఈ సౌత్ బాక్సింగ్ పోటీల్లో రాజేంద్రనగర్ జాతీయ విద్యా భవన్ విద్యాశ్రమంకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 18,19వ తేదీల్లో తమిళనాడు చెంగల్‌పట్టులోని శ్రీ గోకులం పబ్లిక్ స్కూల్‌లో జరిగిన సీబీఎస్ఈ సౌత్ జోన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రాజేంద్రనగర్‌లోని భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమానికి చెందిన కౌసర్ ఫాతిమా అండర్-17 విభాగంలో సిల్వర్ మెడల్ సాధించి సీబీఎస్ఈ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించింది. అండర్-17 విభాగం బాక్సింగ్‌లో పాల్గొన్న చుప్పీతా యాదవ్ బ్రాంజ్ మెడల్ గెలుచుకోగా... లక్ష్మి నరసింహా అండర్-14 విభాగంలో బ్రాంజ్ మెడల్ గెలుచుకున్నాడు. అక్టోబర్ 17 నుంచి 20వ తేదీ వరకు హరియాణా మహేందర్ ఘర్‌లోని ఎస్డీ సీనియర్ సెకండరీ స్కూల్‌లో జరగనున్న సీబీఎస్ఈ జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీల్లో కౌసర్ ఫాతిమా పాల్గొననున్నారు. వీరిని భారతీయ విద్యా భవన్ విద్యాశ్రమం యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ రవికిరణ్, ఫిజికల్ డైరెక్టర్ మురళీకృష్ణ, ఎస్.సంతోష్‌తో పాటు విద్యార్థులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఫాతిమా తల్లిదండ్రులు తమ కుమార్తె సీబీఎస్ఈ జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.



పతకాలతో విద్యార్థులు

మూసీ సుందరీకరణ ప్రభుత్వ లక్ష్యం

గోల్కొండ: మూసీ ప్రక్షాళనలో హైడ్రా పాత్ర ఏమాత్రం లేదని కార్వాన్ నియోజకవర్గ ఏ-బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట నిలబెట్టుకునే వ్యక్తి అని మూసీని సుందరీకరణ చేయడమే ఆయన లక్ష్యమని ఆదివారం కార్వాన్‌లో జరిగిన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో ఆయన స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ నచ్చని వారు మూసీ పరీవాహక ప్రాంతంలో హైడ్రా ఇళ్లు కూలుస్తుందని నిరాధారణ ఆరోపణలు చేస్తున్నారన్నారు. పక్కా పథకం ప్రకారమే మూసీ ప్రక్షాళన కొనసాగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కిషన్, రాంకుమార్, కృష్ణ, కరణ్‌కుమార్ తదితరులున్నారు.

జీవా ప్రాంగణంలో సీపీఆర్‌పై అవగాహన

శంషాబాద్ రూరల్: ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ముచ్చింతల్ జీవా ప్రాంగణంలో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని చిన్న జీయర్ స్వామి ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో అనేక కారణాల వల్ల మనిషిలో ఉత్కంఠ, ఉద్వేగం పెరిగి చిన్న వయసులోనే బీపీ, షుగర్ వ్యాధులు వస్తున్నాయన్నారు. మనిషికి నిజమైన ప్రమాదం జబ్బు కాదు.. జబ్బు ఉందనే ఆలోచన రావడమే పెద్ద ప్రమాదకరమని అన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు

అత్తాపూర్: దేశం బాగుండాలంటే బీజేపీకి పట్టం కట్టాలని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి అన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ శివనగర్‌కాలనీ బూత్ నెంబర్ -230లో ఇంటింటికి తిరిగి ప్రజలను 8800002024 నంబర్‌కు మిస్‌కాల్ ఇప్పించి నమోదు యాప్ ద్వారా బీజేపీ సభ్యత్వ నమోదును చేయించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతి బూతులో 200కుపైగా సభ్యత్వం తప్పకుండా చేయాలని తెలిపారు. బీజేపీ, మోదీ ఆధ్వర్యంలో దేశాభివృద్ధి కోసం కృషిచేస్తుందని, దేశం బాగుపడాలంటే బీజేపీకి పట్టం కట్టాలన్నారు. కార్యకర్తలు పార్టీకి ప్రాణం లాంటి వారని, బీజేపీలో పార్టీ సభ్యత్వం కోసం ఇంటింటా ప్రచారం చేశారన్నారు. అనంతరం అత్తాపూర్ డివిజన్ కిసాన్ మోర్చా అధ్యక్షుడు మల్లేష్ ఇంట్లో బూత్ నంబర్ 230లో ప్రధాన మంత్రి మన్‌కి బాత్ కార్యక్రమం 114వ ఎపిసోడ్‌ను వీక్షించారు. అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు సాబాద విజయ్‌కుమార్, మూసీ ప్రక్షాళన కమిటీ కన్వీనర్ ఎస్. జయానందరెడ్డి, శ్రీనివాస్, అనిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కాటేదాన్ బీజేపీ పార్టీ కార్యాలయం ఆవరణలో డివిజన్ అధ్యక్షుడు అడికే జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదుకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లోని ప్రతి బూత్‌లో 400 మంది చొప్పున డివిజన్ వ్యాప్తంగా 20 వేల సభ్యత్వాన్ని టార్గెట్ చేసుకోవాలన్నారు. బీజేపీ పార్టీలో చేరడానికి యువత సిద్ధంగా ఉన్నారన్నారు. డివిజన్‌లో గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఆదరించి మంచి మెజార్టీని అందించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇదే స్ఫూర్తితో మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, రావుల భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఎస్.జగన్, బబ్లూ, శంకర్‌రెడ్డి, రామారావు, నరసింహారెడ్డి, ముజ్జర్, షకీల్, హన్మంత్‌రెడ్డి, రాజ్‌కుమార్, సురేష్, అంజమ్మ, నందిని, శంకర్ పాల్గొన్నారు.



బీజేపీ సభ్యత్వం చేయిస్తున్న బీజేపీ నేతలు



బీజేపీ పార్టీ సభ్యత్వాన్ని అందజేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి